దేశంలో మైనారిటీలపై కక్షగట్టిన బీజేపీ.. విస్తృతస్థాయిలో విద్వేషాగ్నిని ఎగదోస్తోందని సోనియా ఆరోపించారు. ''మోదీ సర్కార్ కేవలం ఒక్క కుబేరుడికి లబ్ధి చేకూర్చే విధానాలు అవలంబిస్తూ దేశ ఆర్థికవ్యవస్థ పటిష్టతను దెబ్బ తీస్తోంది. మైనారిటీలు, మహిళలు, దళితులు, గిరిజనులను లక్ష్యం చేసుకుని దేశంలో విద్వేష వాతావరణాన్ని బీజేపీ సృష్టించింది. ఈ తరుణంలో కాంగ్రెస్ కార్యకర్తలు కార్యసాధకులై ముందుకు కదలాలి. పార్టీ విస్పష్టమైన సందేశాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి పౌరుడిదాకా తీసుకెళ్లాలి. రాజ్యాంగ విలువల తీవ్ర ఉల్లంఘనకు బీజేపీ సర్కార్ తెగించింది. ఖర్గే నాయకత్వంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల పోరులో బీజేపీని ఓడించే లక్ష్యాన్ని పార్టీ కార్యకర్తలు సాధించి చూపాలి'' అని పిలుపునిచ్చారు.

పొత్తుకు సై

- బీజేపీని గద్దె దింపడమే లక్ష్యం
- భావసారూప్య పార్టీలతో పొత్తులు
- త్యాగాలకూ సిద్ధం: ఖర్గే
- ప్లీనరీలో శ్రేణులనుద్దేశించి ప్రసంగం

నవ రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్): ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు భావసారూప్య పార్టీలతో చేయిచేయి కలిపేందుకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. లక్ష్య సాధన కోసం త్యాగాలు చేసేందుకు వెనుకాడబోమని ఉద్ఘాటించారు. రాయ్‌పూర్‌లో పార్టీ ప్లీనరీలో ప్రసంగిస్తూ ప్రధాని మోదీపైనా విమర్శలు ఎక్కుపెట్టారు. 'ఢిల్లీ ప్రధానసేవకుడైన ఆయన ముఖచిత్రంతో రోజూ పత్రికల్లో అడ్వర్‌టైజ్‌మెంట్లు వస్తూనే ఉన్నాయి. ఆయన మాత్రం తన సొంత స్నేహితుడి కోసం 'సేవలందిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. 'పేదల వ్యతిరేక వైఖరి బీజేపీ డీఎన్‌ఏలోనే ఉంది. ప్రజాస్వామ్యం ఖూనీకాకుండా ఆపేందుకు ప్రజాఉద్యమం వెల్లువలా రావాల్సిన అవసరమొచ్చింది. భారత్ జోడో యాత్ర.. ప్రజాసమస్యలకు గొంతుకగా మారింది. బీజేపీ హయాంలో రాజ్యాంగ విలువలు, సామాజిక సామరస్యం దెబ్బతిన్నాయి. చైనాతో సరిహద్దు వివాదం, పెచ్చరిల్లుతున్న విద్వేషం, పెరిగిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఆర్థిక అసమానతలు దేశానికి పెను సవాళ్లు విసురుతున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్ నేతృత్వంలోని భావసారూప్య పార్టీలే కొత్త ప్రభుత్వపాలన ద్వారా ప్రజాసంక్షేమాన్ని సాధ్యంచేయగలవు. అందుకోసం ఎలాంటి త్యాగాలు చేసేందుకైనా సదా సిద్ధం' అని వ్యాఖ్యానించారు. 'పార్లమెంటరీ, రాజ్యాంగ సంప్రదాయాలను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు ఈడీ, సీబీఐలను బీజేపీ రంగంలోకి దింపింది. ఛత్తీస్‌గఢ్‌లో ప్లీనరీ సమావేశాలకు ఇబ్బందికలిగేలా ఇక్కడి నేతలపై ఈడీ దాడులకు తెగబడింది. అయినా నేతలు తెగవతో ఎదుర్కొని సమావేశాలు సజావుగా సాగేలా చేశారు' అని అన్నారు.

రైతుకు రూ.27.. వారికి రూ.1,000 కోట్లు

కుబేరుడు గౌతమ్ అదానీని ఉద్దేశిస్తూ.. 'దేశం ఎటు పోతోంది? ఓవైపు రైతుకు రోజుకు కేవలం రూ.27 ఆదాయం దక్కుతుంటే ప్రధాని స్నేహితుడు రోజుకు రూ.1,000 కోట్ల ఆదాయం ఎలా రాబట్టగలుగుతున్నారు? కోవిడ్ కాలంలో ప్రధాని స్నేహితుల సంపద 1,300 శాతం ఎగసింది. రైల్, భెయిల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్), సెయిల్ (స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా).. ఇలా ప్రతీదీ వారికే ధారాదత్తం చేస్తున్నారు. ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ అయినా ఉంచుతారో లేక వీరికే అమ్మేస్తారోనని ప్రజల్లో ఆలోచనలు పెరిగాయి. ధరాఘాతంతో దేశ ప్రజల ఇంటి బడ్జెట్ తలకిందులవుతుంటే ఇక్కడి పారిశ్రామికవేత్తలు అపరకుబేరుల అవతారం ఎత్తుతున్నారు. అధికార బుల్డోజర్ కింద పేదలు నలిగిపోతున్నారు. ఓవైపు చైనా భారత భూభాగంలోకి చొరబడుతుంటే విదేశాంగ మంత్రి జైశంకర్ తన తండ్రికి అప్పట్లో ప్రమోషన్ దక్కలేదని వాపోతారు' అని ఖర్గే అన్నారు.

ఇవే మా లక్ష్యాలు

'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగంలో కోట్లాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. నిత్యావసర సరకుల ధరలు దించుతాం. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గిస్తాం. రైతుల ఉత్పత్తులకు సరైన ధర కల్పిస్తాం. విద్వేష వాతావరణాన్ని చెదరగొట్టి సామరస్యాన్ని సాధించి చూపుతాం. ధన బలం, అధికార బలం లేకుండా చూస్తాం. దేశ పురోభివృద్ధిలో ప్రజలతో కలిసి నడుస్తాం. ముందుండి నడిపిస్తాం' అన్నారు.


ప్లీనరీ వేదికపై సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్, ప్రియాంక తదితరులు

సీడబ్ల్యూసీలో 50 శాతం వారికే

వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలు, మహిళలు, యువత, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ తన పార్టీ రాజ్యాంగానికి సవరణ చేసింది. సవరణ ప్రకారం పార్టీ నుంచి ప్రధానులైన నేతలు, మాజీ ఏఐసీసీ చీఫ్‌లకు సీడబ్ల్యూసీలో సభ్యత్వం ఉంటుంది. సీడబ్ల్యూసీ సభ్యుల సంఖ్యను 25 నుంచి 35కు పెంచారు. ఇకపై పార్టీలో కేవలం డిజిటల్ మెంబర్‌షిప్, రికార్డులను కొనసాగిస్తారు.

మూడో ఫ్రంట్‌తో ఎన్డీయేకే మేలు

మూడో ఫ్రంట్ అనే మాటే వినపడకుంటే భావసారుప్యత ఉన్న అన్ని పార్టీలను 'గుర్తించి', 'సమీకరించి', 'ఏకంచేసే' బృహత్తర పనికి వెంటనే పూనుకోవాలనే రాజకీయ తీర్మానం ముసాయిదాలో కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. 'కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు లౌకిక, సామ్యవాద శక్తుల ఏకీకరణే అసలైన హాల్‌మార్క్‌గా నిలుస్తుంది. ఎన్డీయేకు వ్యతిరేకంగా విపక్షాలను ఐక్యం చేయాల్సిన అత్యవసరస్థితి ఇది. ఆలస్యం చేస్తే అది ఎన్డీయేకే మేలు చేస్తుంది' అని ముసాయిదాలో నేతలు ఆందోళన వ్యక్తంచేశారు.

'ప్రధాని ఆశతోనే కాంగ్రెస్, ఆర్జేడీతో దోస్తీ

బిహార్ సీఎం నితీశ్ కుమార్‌పై అమిత్ షా ధ్వజం

లారియా(బిహార్): బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్‌పై బీజేపీ అగ్రనేత అమిత్ షా ఆరోపణల వర్షం కురిపించారు. బిహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లాలోని లారియాలో శనివారం ర్యాలీలో అమిత్ షా ప్రసంగించారు. 'మూడేళ్లకోసారి నితీశ్‌కు ప్రధాని పీఠంపై ప్రేమ పుట్టుకొస్తుంది. అందుకే హఠాత్తుగా బీజేపీతో పొత్తును తెగతెంపులు చేసుకుని కాంగ్రెస్, ఆర్జేడీతో జట్టుకట్టారు. ఆయన పచ్చి అవకాశవాది' అంటూ నిప్పులు చెరిగారు.'బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ కంటే బీజేపీనే ఎక్కువ సీట్లు సాధించినా ఇచ్చిన మాట కోసం నితీశ్‌నే మోదీ ముఖ్యమంత్రి చేశారు. ఇకపై నితీశ్‌తో ఇక జట్టుకట్టేదిలేదు' అని తేల్చిచెప్పారు.

బెంగాల్‌లో కేంద్రమంత్రి కాన్వాయ్‌పై దాడి

దిన్హాటా: పశ్చిమబెంగాల్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిశిత్ ప్రామాణిక్ కాన్వాయ్‌పై తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారులుగా భావిస్తున్న వారు దాడికి పాల్పడ్డారు. కూచ్‌బెహార్ జిల్లా దిన్హాటా ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. 'పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తుండగా టీఎంసీ కార్యకర్తలు నా కాన్వాయ్‌పై రాళ్లతో దాడి చేశారు. బాంబులు విసిరారు. కాల్పులు కూడా జరిపారు. దాడిలో పలువురు బీజేపీ కార్యకర్తలు గాయపడ్డారు. పోలీసులు చూస్తుండగా ఇవన్నీ జరిగాయి'అని మంత్రి ఆరోపించారు. ఈ సందర్భంగా టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టి, పరిస్థితిని సద్దుమణిగించారు.

ఎదురుకాల్పుల్లో నేలకొరిగిన ముగ్గురు జవాన్లు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండ అటవీప్రాంతంలో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు డీఆర్జీ జవాన్లు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు, డీఆర్జీ బలగాలు జేగురుగొండ నుంచి దండకారణ్య అటవీ ప్రాంతంలో రోజువారీ గాలింపుల్లో ఉండగా కందేడ్ అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం మావోయిస్టులు కాల్పులు జరిపారు. ముగ్గురు జవాన్లు మృతి చెందగా గాయపడిన వారిని వెంటనే క్యాంప్‌కు తరలించి వైద్యమందించారు. రెండు ఏకే 47 తుపాకులు, 51 ఎంఎం మోర్టార్‌ను మావోయిస్టులు అపహరించారు. కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయి ఉంటారని పోలీసులంటున్నారు. వారి కోసం భారీగా కూంబింగ్ చేపట్టినట్టు బస్తర్ రేంజ్ ఐజీపీ సుందర్‌రాజ్ చెప్పారు.

ఆర్మీ జవాన్‌ను హతమార్చిన మావోయిస్టులు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో శనివారం ఓ ఆర్మీ జవాన్‌ను మావోయిస్టులు హతమార్చారు. జిల్లాలోని బడెతెవాడకు చెందిన జవాన్ మోతీరామ్ సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. సమీపంలోని ఉసేలీ వారపు సంతలో కోడి పందేలు చూస్తుండగా ముగ్గురు మావోయిస్టులు మూడు రౌండ్ల కాల్పులు జరపడంతో మోతీరాం అక్కడికక్కడే మృతిచెందారు.

శాంతి ప్రక్రియలో భాగస్వామ్యానికి సిద్ధం

- ఉక్రెయిన్ సంక్షోభంపై మోదీ
- జర్మనీ చాన్స్‌లర్ షోల్జ్‌తో భేటీ

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చలు, దౌత్యమార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పదేపదే చెబుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ఇందుకు సంబంధించిన ఎలాంటి శాంతి ప్రక్రియలోనైనా భాగస్వామిగా మారేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఢిల్లీలో శనివారం జర్మన్ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌తో చర్చలు జరిపారు. ఏడాదిగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ సంక్షోభం పర్యవసానాలు ముఖ్యంగా ఆహారం, ఇంధన భద్రత వంటి పలు అంశాలతో వాణిజ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతికతలు, వాతావరణ మార్పు వంటి అంశాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో షోల్జ్..'ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ తీవ్ర విపత్తు, ఇది ప్రపంచంపై విపరీత దుష్ప్రభావాలను కలుగజేసింది. ఈ అంశంపై ఐక్యరాజ్య సమితి సహా అన్ని వేదికలపై మనం వేసే అడుగులపై స్పష్టత అవసరం'అని పేర్కొన్నారు. హింసామార్గం ద్వారా సరిహద్దులను ఎవరూ మార్చ జాలరని షోల్జ్ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్వేచ్ఛావాణిజ్యం ఒప్పందం(ఎఫ్‌టీఏ), పెట్టుబడుల రక్షణ ఒప్పందాలను సాధ్యమైనంత తొందరగా ఖరారు చేయాలనుకుంటున్నట్లు షోల్జ్ చెప్పారు.


రాష్ట్రపతి ముర్ముతో షోల్జ్

భారత్ వైఖరి మొదట్నుంచీ అదే

'ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చలు, దౌత్యమార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ మొదట్నుంచీ కోరుతోంది. ఇందుకు సంబంధించి జరిగే శాంతి ప్రక్రియలో పాలుపంచుకునేందుకు సిద్ధంగా ఉంది'అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితిలోనూ ఇదే విషయం కుండబద్దలు కొట్టిందన్నారు. 'భారత్, జర్మనీల మధ్య రక్షణ, భద్రత సహకారం వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలకంగా మారనుంది. ఈ రంగాల్లో మరిన్ని అవకాశాలను అన్వేషించాలి. ఉగ్రవాదం, వేర్పాటు వాదంపై పోరులో భారత్, జర్మనీల మధ్య మంచి సహకారం కొనసాగుతోంది'అని మోదీ అన్నారు. భారత్‌లో రెండు రోజుల పర్యటనకు గాను షోల్జ్ శనివారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు.

అమెరికాను వదలని మంచు తుపాను

లాస్‌ఏంజెలెస్: అమెరికాలోని పశ్చిమ రాష్ట్రాలు మంచు తుపాను తాకిడికి విలవిల్లాడుతున్నాయి. దాదాపు 10 లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు మూతబడ్డాయి. ఒక్క శుక్రవారమే 300పైగా విమాన సర్వీసులు రద్దవగా, మరో 5 వేల సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. కాలిఫోర్నియా, మిషిగన్ రాష్ట్రాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. సియెర్రా నెవడా, దక్షిణ కాలిఫోర్నియా పర్వత శ్రేణుల్లో 1.5 మీటర్ల మేర మంచు కురియవచ్చని, ఫలితంగా ఆకస్మిక వరదలు సంభవిస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పశ్చిమ తీరంలోని కీలకమైన నార్త్–సౌత్ హైవేను కలిపే ఇంటర్ స్టేట్ –5ను మూసివేశారు. మిషిగన్‌లో మంచు కురియడంతో కరెంటు లైన్లు తెగిపోయాయి. ఒక దశలో మిషిగన్‌లోని 8.20 లక్షల ఇళ్లకు కరెంటు సరఫరా బందయింది. గత 50 ఏళ్లలో ఇంత తీవ్రంగా ప్రభావం చూపిన మంచు తుపాను ఇదేనని డెట్రాయిట్ విద్యుత్ శాఖాధికారి ఒకరు చెప్పారు. .శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో భారీ స్థాయిలో మంచుకురియడం చాలా అరుదని శంకర్ క్రిష్ణన్ అనే స్థానికుడు చెప్పారు.


కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఆల్పైన్ మిడోస్ ప్రాంతంలో కొండలా పేరుకుపోయిన మంచు

నేపాల్ కొత్త అధ్యక్షుడిగా పౌద్యాల్!

ఎనిమిది పార్టీల మద్దతు • ప్రమాదంలో ప్రచండ సర్కారు!

కాఠ్మాండూ: నేపాల్ నూతన అధ్యక్షుడిగా నేపాలీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామచంద్ర పౌద్యాల్ ఎన్నికయ్యే అవకాశముంది. దేశాధ్యక్ష ఎన్నికల్లో భాగంగా శనివారం ఆయన అభ్యర్థిత్వానికి ఎనిమిది రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. కేపీ శర్మ ఓలీ నేతృత్వంలోని సీపీఎన్(యూఎంఎల్), పుష్పకమల్ దహాల్(ప్రచండ) నేతృత్వంలోని సీపీఎన్(మావోయిస్ట్ సెంటర్), మరో ఐదు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన సంగతి తెల్సిందే. అయితే కూటమి పార్టీ అయిన సీపీఎన్(యూఎంఎల్) బలపరిచిన అభ్యర్థి సుభాష్ నెబాంగ్‌కి కాకుండా అధికార కూటమిలోలేని వేరొక పార్టీ అభ్యర్థికి ప్రధానమంత్రి ప్రచండ మద్దతు పలకడంతో రెండునెలల క్రితమే కొలువుదీరిన ప్రభుత్వం కూలే పరిస్థితులు నెలకొన్నాయి. నేపాల్ పార్లమెంట్‌లో పార్టీల ప్రస్తుత బలాబలాల ప్రకారం ఈ ఎనిమిది పార్టీలు బలపరిచే అభ్యర్థే వచ్చే నెలలో జరిగే దేశాధ్యక్ష ఎన్నికల్లో గెలుస్తారు. ప్రచండ నిర్ణయంతో ఆగ్రహించిన అధికార కూటమిలోని నేషనల్ డెమొక్రటిక్ పార్టీ తాము ప్రభుత్వం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ లింగ్డెన్ ఉపప్రధానిగా రాజీనామా చేశారు. కూటమి పార్టీలు మద్దతు ఉపసంహరిస్తే నెలరోజుల్లోపు పార్లమెంట్‌లో ప్రచండ విశ్వాస పరీక్షలో నెగ్గాలి.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఈకే-528 విమానంలో శనివారం ఉదయం వచ్చిన ప్రయాణికుడిని అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లోదుస్తుల లోపల కవర్‌లో దాచిన పేస్టు రూపంలో ఉన్న బంగారం బయటపడింది. మొత్తం 823 గ్రాములున్న బంగారం విలువ రూ.47 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆస్ట్రేలియన్ రూల్స్ ఫుట్‌బాల్ పోటీలు

పంజగుట్ట: ఆస్ట్రేలియన్ రూల్స్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 26న (ఆదివారం) జింఖానా మైదానంలో సౌత్, వెస్ట్ జోనల్ ఆస్ట్రేలియన్ రూల్స్ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ నేషనల్ ఆపరేషన్స్ హెడ్ కంచన్ పుష్ప ఖురానా తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన ఇండియన్ కెప్టెన్ మహేష్ టిర్కీతో కలిసి మ్యాచ్ వివరాలను వెల్లడించారు.

సిటీలో 'ఇళయ' రాగం..

సాక్షి, సిటీబ్యూరో: మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా నగరం వేదికగా తన సంగీత స్వరాలతో హోరెత్తించనున్నారు. గచ్చిబౌలి స్టేడియం వేదికగా ఆదివారం భారీస్థాయిలో నిర్వహిస్తున్న ఈ 'రాజా లైవ్ ఇన్' సంగీత కచేరీలో తన బృందంతో ఇళయరాజా పాల్గొననున్నారు. హైదరాబాద్ నగరం తనకెంతో ప్రత్యేకమైందని, ఇక్కడ నిర్వహించనున్న సంగీత కార్యక్రమం కోసం ఆతృతగా వేచిచూస్తున్నానని ఆయన తెలిపారు.

న్యూస్‌రీల్

ఓయూ పాలన భవనం చుట్టూ ముళ్లకంచె

- గన్‌మెన్ల కోసం వీసీ దరఖాస్తు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలన భవనానికి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు తరచూ పాలన భవనంలోకి వచ్చి అధికారులు, ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారు. గేట్లను మూసేస్తున్నా ప్రహరీ పైనుంచి దూకి లోనికి ప్రవేశిస్తున్నారు. ఈ క్రమంలో గాయపడుతున్నారు. గోడ దూకి లోనికి ప్రవేశించకుండా పాలన భవనం చుట్టూ ఇనుప ముళ్లకంచె ఏర్పాటు చేశారు. విజిటింగ్ అవర్స్ మినహా ఇతర సమయంలో పాలన భవనంలోకి ఎవరూ రాకూడదని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా వీసీ ప్రొ.రవీందర్ ఎక్కడికి వెళ్లినా అక్కడికి విద్యార్థులు చేరుకుని విధులను అడ్డుకొని దాడి చేస్తామని బెదిరింపులకు పాల్పడుతుండటంతో గన్‌మెన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

వావ్.. జ్యువెలరీ ఎక్స్‌పో



బంజారాహిల్స్: ఎటు చూసినా జిగేల్ జిగేల్.. వందలు.. వేల సంఖ్యలో వివిధ డిజైన్లతో ఆభరణాలు.. వాటిని ప్రదర్శిస్తూ సందడి చేస్తున్న మోడల్స్.. ఆసియా జ్యువెల్స్ ఎక్స్‌పో -2023కు బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్ వేదికైంది. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ప్రదర్శనకు మిస్ ఇండియా ఫస్ట్ రన్నరప్ రూబల్ షెకావత్ హాజరై ఆభరణాలను తిలకించారు. ప్రముఖ ఆభరణాల డిజైనర్లు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. ఫైన్ బ్రాండెడ్ గోల్డ్, డైమండ్, పోల్కి, సంప్రదాయ ఆభరణాలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. ప్రదర్శనలో ఏడో నిజాం ఉస్మాన్ అలీఖాన్ సిద్దిఖీ మునిమనవరాలు ఫిరోజ్ జహాన్ బేగం పాల్గొన్నారు. 50 ప్రఖ్యాత జ్యువెలరీ బ్రాండ్లు ప్రదర్శనలో ఉంచారు.

మ్యాక్స్ క్రిప్టో ట్రేడింగ్‌ను సీబీఐకి బదిలీ చేయండి

హిమాయత్‌నగర్: గతేడాది 'మ్యాక్స్ క్రిప్టో ట్రేడింగ్' పేరుతో కోట్ల రూపాయలు మోసపోయామని, ఆ కేసును సీసీఎస్ నుంచి సీబీఐకి బదిలీ చేయాలంటూ బాధితులు డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయానికి శనివారం వచ్చిన 30మంది బాధితులు అధికారులను కలిసేందుకు ప్రయత్నించారు. అంతకంటే ముందు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. బాధితులు మస్తాన్‌అలీ, సయ్యద్ హబీబ్, ఖమర్‌ఖాన్, ఖయ్యూం, సలీం, మస్తాన్ తదితరులు మాట్లాడుతూ.. క్రిప్టోలో డబ్బు పెడితే కోటీశ్వరులు అవ్వొచ్చని ఆశ చూపించి 'మ్యాక్స్ క్రిప్టో ట్రేడింగ్' వాళ్లు డబ్బు పెట్టించారన్నారు. ఇలా ఒక్కొక్కరిని రూ.25 లక్షలు, రూ.50 లక్షలు, రూ.కోటి చొప్పున దేశవ్యాప్తంగా దాదాపు రూ.500 కోట్ల వరకు ముజీబ్ సయ్యద్ అనే వ్యక్తి చీట్ చేశాడని ఆరోపించారు. గతేడాది అక్టోబర్‌లో సీసీఎస్‌లో కేసు నమోదవ్వగా ముజీబ్ సయ్యద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారన్నారు. ఈ కేసులో తమకు న్యాయం జరగడం లేదని, కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.



సీసీఎస్ కార్యాలయం వద్ద బాధితుల నిరసన







స్నాతకోత్సవ వేళ.. ఆనంద హేల

చప్పట్లు.. కేరింతలతో నల్సార్ లా యూనివర్సిటీ మార్మోగింది. నగరశివారు శామీర్‌పేట్‌లోని నల్సార్ లా యూనివర్సిటీలో స్నాతకోత్సవం, కళాశాల రజతోత్సవాన్ని శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డా.డి.వై.చంద్రచూడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మెడల్స్, పట్టాలు అందుకున్న విద్యార్థులు సందడి చేశారు. – శామీర్‌పేట్

యాక్షన్.. రెడీ!

- ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా..
- పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు
- 'డూస్' అండ్ 'డోంట్స్'తో కరపత్రాలు, పోస్టర్లు
- జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదుల వెల్లువ
- తక్షణ పరిష్కారానికి తగిన యంత్రాంగం లేని బల్దియా

ప్రజల విమర్శలతో కుక్కల బెడద నివారణకు చర్యలు



పోస్టర్ ప్రదర్శిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పుడైనా సరే.. ప్రజల ప్రాణాలు పోయాక సదరు ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామనే జీహెచ్‌ఎంసీ.. కుక్కకాట్ల విషయంలోనూ అలాగే సిద్ధమైంది. ప్రజలకు కుక్కకాట్ల బెడద తగ్గించేందుకు ప్రభుత్వం ఆదేశించిన కార్యక్రమాల అమలుకు సిద్ధమైంది. యాక్షన్ స్టార్ట్ చేయడంతో పాటు పబ్లిసిటీపైనా శ్రద్ధ చూపుతోంది. కుక్కలు మనుషుల జోలికి రాకుండా ఉండేందుకు ఎలా వ్యవహరించాలి? అనే అంశంపై పాఠశాలల్లోని విద్యార్థులకు వివరించడంతో పాటు కుక్కల విషయంలో చేయాల్సినవి, చేయకూడనివి (డూస్ అండ్ డోంట్స్) పనులను వివరిస్తూ పాఠశాలల్లో పోస్టర్లను ప్రదర్శిస్తోంది. కరపత్రాల పంపిణీ ప్రారంభించింది. వీటితోపాటు కుక్కల సంతతి నిరోధానికి ఆపరేషన్లు, రేబిస్ సోకకుండా వ్యాక్సిన్లు వేసే చర్యలు చేపట్టినట్లు పేర్కొంది.

ప్రతియేటా కుక్కల గణన

వీటితోపాటు ప్రతియేటా కుక్కల గణన చేపట్టాలని నిర్ణయించింది. వీధికుక్కలకు సంబంధించిన ఫిర్యాదులందగానే తక్షణ చర్యలు చేపట్టాలని, కుక్కల సంరక్షణ కేంద్రాలకు తరలించే కుక్కలకు వ్యాధులుంటే చికిత్సలు చేయడంతోపాటు ఆహార సమస్యలు తలెత్తకుండా చూడాలని నిర్ణయించింది.విద్యార్థులతో పాటు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వయం సహాయక సంఘాలు, స్లమ్ ఫెడరేషన్ సభ్యులకు సైతం కుక్కలకు సంబంధించి తగిన అవగాహన కల్పించనున్నారు. కుక్కలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టనున్నారు. మాంసం, ఇతరత్రా ఆహార వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో వేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. మూసీ ప్రాంతాల్లో నూరుశాతం వీధికుక్కలను పట్టుకునేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొంది. కుక్క కాటు నివారణకు స్వచ్ఛంద సంస్థలు , జంతు ప్రేమికులు, ప్రజాప్రతినిధులు తగిన సహకారం అందించాల్సిందిగా కోరింది.

సామర్థ్యం లేని బల్దియా..

వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నా.. వాటిని పరిష్కరించేందుకు తగిన యంత్రాంగం బల్దియాలో లేదు. వచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగా వీధి కుక్కలను పట్టుకునేందుకు తగిన వాహనాలు, నిపుణులైన సిబ్బంది గానీ లేరు. ఫిర్యాదుల్లో ఒకే ప్రాంతం సమస్యను ఎక్కువ సార్లు ఫోన్ చేసి చెప్పడంతో అధిక సంఖ్యలో ఫిర్యాదులు కనిపిస్తున్నాయని జీహెచ్‌ఎంసీ చెబుతోంది.

ఫిర్యాదుల వరద..

అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడు కుక్కలదాడిలో మృతి చెందడంతో నగర ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో, టీవీల్లో దాడి దృశ్యాలు చూసిన వారు బయటకు వెళ్లే తమ పిల్లల గురించి ఆందోళన చెందుతున్నారు. జీహెచ్‌ఎంసీ కాల్‌సెంటర్‌కు నాలుగు రోజులుగా నిత్యం రెండు వేలకు పైగా ఫిర్యాదులు అందాయి. నాలుగు రోజుల్లో పదివేలకు పైగా ఫిర్యాదు వచ్చాయి. వివరాలిలా ఉన్నాయి.

తేదీ	ఫిర్యాదులు
22	2,925
23	3,210
24	3,130
25(సాయంత్రం వరకు)	1,230
మొత్తం	10,495

జీహెచ్‌ఎంసీ ముద్రించిన పోస్టర్లలో దిగువ అంశాలు పేర్కొన్నారు

చేయాల్సినవి..

- కుక్క మీ దగ్గరకు వస్తుంటే.. కదలకుండా అక్కడే నిలబడాలి.
- వీధి కుక్కలకు దూరంగా ఉండాలి.
- నిశ్శబ్దంగా ఉండాలి.
- పిల్లలతో ఉన్న కుక్కల దగ్గరకు వెళ్లొద్దు.
- కుక్కలతో స్నేహపూర్వకంగా ఉండాలి.. కానీ వాటిని ముట్టుకోవద్దు.
- కుక్కల గుంపు కనిపిస్తే వాటికి దూరంగా ఉండాలి.

చేయకూడనివి..

- కుక్కలు అరుస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, నిద్రిస్తున్నప్పుడు వాటికి భంగం కలిగించొద్దు.
- వీధికుక్కలపై రాళ్లు విసరడం వంటివి చేయొద్దు.
- తల్లి, పిల్లలు ఉన్నప్పుడు కుక్కల వద్దకు వెళ్లొద్దు.
- కుక్కల వెంటపడి తరమడం చేయవద్దు.
- కుక్కల తోక, చెవులు లాగడం వంటి పనులు చేయవద్దు.
- రోడ్లపై మాంసాహారం వేయవద్దు.

- ఎప్పుడైనా కుక్క కరిస్తే కరిచిన ప్రాంతంలో సబ్బుతో శుభ్రం చేసి వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- జీహెచ్‌ఎంసీని సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 040-21111111



విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

ఇద్దరు యువకుల ఆత్మహత్య

చదువులో వెనుకబడిపోయా..

- అమ్మానాన్న క్షమించాలంటూ సూసైడ్ నోట్
- మరో యువకుడి ఆత్మహత్యకు తెలియని కారణాలు
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



నివాస్(ఫైల్)



సాయి గణేశ్ (ఫైల్)

ఘట్‌కేసర్: 'అమ్మానాన్న క్షమించండి.. చదువులో వెనుకబడ్డాను.. నేను వెళ్లిపోతున్నాను.. మీ ఆశయాలను నెరవేర్చలేకపోతున్నాను.. అక్కను జాగ్రత్తగా చూసుకోండి' అంటూ సూసైడ్ నోట్ రాసి ఓ బీ ఫార్మసీ విద్యార్థి ఉరి వేసుకొని, అదే గదిలో అతడి స్నేహితుడు గుర్తుతెలియని మందుతాగి ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం..

మేడ్చల్ మండలం ఘనాపూర్‌కు చెందిన తొంపాల నివాస్(19) చౌదరిగూడ విజయపురి కాలనీ ప్రిన్స్‌టన్ బీ ఫార్మసీ కళాశాలలో మూడో సంవత్సరం విద్యార్థి. స్థానిక ఎంజీఆర్ మాల్‌లో పనిచేసే భద్రాచలం కోరుకొండకు చెందిన గురుగుల సాయిగణేశ్(21) స్నేహితులు. వీరిద్దరూ కళాశాల సమీపంలో విజయపురి కాలనీలో ఓ అద్దె గదిలో ఉంటున్నారు. మొదటి ఏడాది కళాశాల వసతి గృహంలో ఉన్న నివాస్ అనంతరం అద్దె గదిలో స్నేహితుడితో కలిసి ఉంటున్నాడు. పరీక్షలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినట్లు తరచూ స్నేహితులతో అంటుండేవాడు. కాగా శనివారం కళాశాలకు వెళ్లకుండా ఇద్దరు స్నేహితులు గదిలోనే ఉన్నారు. నివాస్ కోసం స్నేహితులు వెళ్లిచూడగా గదిలో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించగా.. సాయి గణేశ్ వాష్‌రూంలో గుర్తు తెలియని మందు తాగి మృతి చెంది ఉన్నాడు. స్నేహితుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా నివాస్ జేబులో సూసైడ్ నోట్ లభించింది.

చదువులో వెనుకబడ్డానని, తల్లిదండ్రులు క్షమించాలని అందులో రాసి ఉందని పోలీసులు తెలిపారు. సాయిగణేశ్ ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. నివాస్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని మృతుడి సోదరుడు తెలిపాడు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి నివాస్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ప్రేమ విఫలం, ఆర్థిక సమస్యలు, చదువులో వెనుకబడిపోవడం తదితర అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవాన్ష్.. మరికొందరికి జీవితమై..

- చిత్రపురి కారు ప్రమాదంలో గాయాలపాలై..
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- బాలుడి అవయవాలను దానం చేసిన తల్లి

మణికొండ: చిత్రపురి కాలనీలో కారు ప్రమాదంలో గాయపడి ఐదు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జీవాన్ష్(7) మృత్యువుతో చేసిన పోరాటంలో ఓటమి చెందాడు. లండన్‌లో పుట్టి ఎంతో ఉన్నతంగా ఉన్న జీవితం ఒక్కసారిగా విధి వక్రీకరించి వారి కుటుంబాన్ని అస్తవ్యస్తం చేసింది. లండన్ వదలి హైదరాబాద్‌కు రావడం, తండ్రి మద్యానికి బానిస కావడం, అనారోగ్యంతో ఇటీవలే మృతి చెందడంతో వారి పరిస్థితి తలకిందులైంది. తండ్రి గతంలో చిత్రపురిలో మెయింటెనెన్స్ మేనేజర్‌గా పనిచేయటంతో ఇక్కడే తల్లి శ్రావణితో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 18వ తేదీ శివరాత్రి రోజు ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటుంటున్న తరుణంలో సెల్లార్‌లో నుంచి పైకి వచ్చిన కారు అతడి తలపై నుంచి వెళ్లిన విషయం తెలిసిందే. దాంతో బాలుడిని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సకు ఏకంగా రూ.30 లక్షలు అవుతాయని డాక్టర్లు చెప్పడంతో చిత్రపురి కాలనీవాసులు, మణికొండ ప్రజలు ఆర్థిక సాయం అందించారు.




జీవాన్ష్(ఫైల్)

మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పందించి ప్రభుత్వపరంగా తమవంతు సహకారం అందిస్తామని హామీలు ఇచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొంది తిరిగి వస్తాడనుకున్న బాలుడు మృతి చెందడంతో చిత్రపురిలో విషాదం నెలకొంది. బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. తన కుమారుడు మృతి చెందినా మరొకరిలో బతికే ఉంటాడని భావించిన తల్లి శ్రావణి అవయవదానం చేసేందుకు అంగీకరించింది. అతడి శరీరం నుంచి పలు అవయవాలను సేకరించి మృతదేహానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

లాభాల ఎర.. ఆపై టోకరా

ఒక్క రోజులో రూ. కోటి స్వాహా

- యూట్యూబ్‌లో లైక్, కామెంట్, షేర్ చేయాలంటూ వల



హిమాయత్‌నగర్: ఒక్క రోజులో సైబర్ కేటుగాళ్లు రూ.కోటి కొట్టేశారు. డబ్బు పోగొట్టుకున్న బాధితులు శనివారం సైబర్‌క్రైం పోలీసు స్టేషన్‌కు క్యూ కట్టారు. సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లో నివాసం ఉండే వైద్యురాలికి కొద్దిరోజుల క్రితం టెలిగ్రాంలో ఓ యువతి పరిచయమైంది. తాము పంపించే యూట్యూబ్ లింకులను ఓపెన్ చేసి దానిలోని వీడియోను లైక్, కామెంట్‌తో పాటు షేర్ చేస్తే ఒక్కో లైక్‌కు రూ.500, కామెంట్‌కు రూ.1,000, షేర్ చేస్తే రూ.2 వేలు ఇస్తామన్నారు. తొలిరోజుల్లో లాభాలు ఇచ్చారు. వీరి మధ్య సాన్నిహిత్యం బలపడింది. దీంతో ఇన్వెస్ట్‌మెంట్ వైపు ఆమెను ఆహ్వానించింది. దీనికి ఒప్పుకున్న వైద్యురాలికి ఇన్వెస్ట్‌మెంట్‌లో కూడా తొలుత లాభాలు ఇచ్చారు. ఆ తర్వాత పెట్టిన పెట్టుబడికి టాస్క్‌లు ఉన్నాయంటూ చెబుతూ పలు దఫాలుగా రూ.64 లక్షలు దోచుకున్నారు. మరో వ్యక్తి అమెజాన్ గిఫ్ట్ కూపన్స్ కొనుగోలు చేసి ఆన్‌లైన్‌లో ఇతరులకు విక్రయిస్తుంటాడు. కేవైసీ తీసుకున్న వారికే గిఫ్ట్ కూపన్స్‌ను బల్క్‌లో కొంతకాలంగా ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నాడు. బల్క్‌లో తీసుకున్న కొందరు డబ్బు వేస్తున్నట్లు నటించి డబ్బు వేయలేదు. రెండు నెలల వ్యవధిలో కేవైసీ ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు రూ.34 లక్షలు కాజేశారు. మరో ఐదుగురి నుంచి సైబర్ నేరగాళ్లు ఓటీపీలు, ఇన్వెస్ట్‌మెంట్లు అంటూ దాదాపు రూ.10 లక్షలు స్వాహా చేశారు. ఇలా శనివారం ఒక్కరోజే కోటికి పైగా డబ్బు పోగొట్టుకున్న వారు సైబర్‌క్రైం పోలీసుల్ని ఆశ్రయించారు.

'ఐఎస్‌బీ'ని సందర్శించిన ఐ.రా.స బృందం

రాయదుర్గం: ఐక్యరాజ్యసమితి రాయబారుల ప్రతినిధి బృందం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను శనివారం సందర్శించారు. ఐఎస్‌బీ క్యాంపస్‌లో ఐక్యరాజ్య సమితికి చెందిన 11 మంది సభ్యుల ఉన్నత స్థాయి రాయబారుల ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆ బృందం ఐఎస్‌బీ విద్యా, పరిశోధన, ర్యాంకింగ్‌ను పరిశీలించి ప్రశంసించింది. ఐఎస్‌బీతో సహకరించేందుకు తమ సుముఖత వ్యక్తం చేసింది. బార్బడోస్, గాంబియా, కజకిస్తాన్, మాలి, మారిటానియా, మంగోలియా, మైక్రోనేషియా, సియెర్రా లియోన్, సౌత్ సూడాన్, సెయింట్ లూసియా, టోంగా దేశాలకు చెందిన రాయబారుల బృందం పర్యటించి పలు అంశాల గురించి ఐఎస్‌బీ బృందంతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఐఎస్‌బీలో ఐక్యరాజ్యసమితి రాయబారుల బృందం

డ్రగ్స్‌కు బానిసలైన నలుగురు నిందితులు

- మూడు కమిషనరేట్లలో పదుల సంఖ్యలో కేసులు
- తాజాగా మరోసారి అరెస్టు చేసిన ఎల్బీనగర్ పోలీసులు
- 15 గ్రాముల ఎండీఎంఏ, 2 కిలోల గంజాయి స్వాధీనం

ఎన్నిసార్లు అరెస్టయినా బుద్ధి మారలే..



సాక్షి, సిటీబ్యూరో: ఒకటి కాదు.. రెండు కాదు.. పదులసార్లు పోలీసులకు చిక్కి, జైలు ఊచలు లెక్కపెట్టినా వీరి బుద్ధి మారలేదు. మాదకద్రవ్యాలకు బానిసలైన నలుగురు పాత నేరస్తులు మళ్లీ ఖాకీలకు చిక్కారు. ఎల్బీనగర్‌లో గంజాయి, ఎండీఎంఏ కొనుగోలు చేస్తుండగా ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.4,040 నగదుతో పాటు 15 గ్రాముల ఎండీఎంఏ, 2 కిలోల గంజాయి, కారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

- సరూర్‌నగర్‌కు చెందిన జక్కా సునీల్, వనస్థలిపురానికి చెందిన షేక్ నోమాన్ ఇద్దరు స్నేహితులు. డ్రగ్స్‌కు బానిసలైన ఇరువురు సేవించడంతో పాటు విక్రయిస్తుంటారు కూడా. ఈ క్రమంలో నోమాన్ స్నేహితులైన సంతోష్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఆరీఫ్ ఖాన్ అలియాస్ ఖాన్ సాబ్, పహాడీషరీఫ్‌కు చెందిన మహ్మద్ జాబీర్ ఖాద్రీ అలియాస్ షాజాడా, సంతోష్‌నగర్‌కు చెందిన మీర్జా ఇస్మాయిల్ అలీబేగ్‌లకు కూడా డ్రగ్స్ అలవాటైంది. వీరిపై ఏపీతో పాటు రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లలోని పలు ఠాణాల్లో పదుల సంఖ్యలో ఎన్‌డీపీఎస్, హత్య కేసులు ఉన్నాయి.
- ఈక్రమంలో మూడు రోజుల క్రితం అరకు ప్రాంతానికి వెళ్లిన సునీల్.. స్థానికంగా గంజాయి సరఫరా చేసే శత్రు అనే వ్యక్తి నుంచి 2 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, ఎల్బీనగర్ ప్రాంతానికి చేరుకున్నాడు. ఇక్కడ స్నేహితుడు నోమాన్‌ను కలిశాడు. సునీల్ నుంచి రూ.4-5 వేలకు గంజాయి కొని వాటిని చిన్న ప్యాకెట్లుగా చేసి ఒక్కోటి సైజును బట్టి రూ.500 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటాడు.
- ఈక్రమంలో కారులో సునీల్, నోమాన్‌లు శనివారం ఉదయం ఎల్బీనగర్ క్రాస్‌రోడ్‌కు అప్పటికే ఆరీఫ్ ఖాన్, జాబీర్ ఖాద్రీ, మీర్జాలు ఎదురుచూస్తున్నారు. కారు రాగానే వెనకాల ఎక్కిన ముగ్గురు నోమాన్, సునీల్ నుంచి గంజాయి, ఎండీఎంఏలను కొనుగోలు చేశారు. అకస్మాత్తుగా నోమాన్ కారు దిగి ఇప్పుడే వస్తానని చెప్పి అక్కడ్నుంచి వెళ్లిపోయాడు. అప్పుడే ఎల్బీనగర్ ఎస్‌ఓటీ, ఎల్బీనగర్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి కారులో ఉన్న నలుగురు నిందితులను పట్టుకున్నారు. నోమాన్, శత్రు పరారీలో ఉన్నారు.

జేఎన్‌టీయూహెచ్ మెగా జాబ్ ఫెయిర్‌కు స్పందన



జాబ్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న వీసీ

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించింది. శని, ఆదివారం రెండు రోజుల పాటు జరిగే ఈ జాబ్‌ఫెయిర్‌కు ఆన్‌లైన్ ద్వారా సుమారు 80 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాబ్ ఫెయిర్‌ను జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే శనివారం నుంచి రూరల్ ప్రాంతాల్లోని జేఎన్‌టీయూహెచ్ కళాశాలల్లో కూడా జాబ్ ఫెయిర్‌ను నిర్వహిస్తామని తెలిపారు.

ప్రాణం తీసిన శానిటైజర్

- ఒంటికి శానిటైజర్ రాసుకున్న చిన్నారి
- ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


జన్‌వీర్ ప్రీతి (ఫైల్)

అంబర్‌పేట: శానిటైజర్ ఓ నాలుగేళ్ల పాప ప్రాణం మీదికి తెచ్చింది. ఒంటికి రాసుకున్న శానిటైజర్‌కు మంటలు అంటుకోవడంతో చిన్నారి మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన శనివారం కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామ్‌లక్ష్మణ్‌రాజ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేట 6 నెంబర్‌లో నివాసం ఉంటున్న జగనాథం, రాజేశ్వరీ దంపతులకు అక్షర, ప్రీతి(4) ఇద్దరు కుమార్తెలు. రాజేశ్వరీ ఇద్దరు కుమార్తెలతో కలిసి కృష్ణానగర్‌లో ఉంటున్న పుట్టింటికి వచ్చింది. శనివారం రాజేశ్వరీ ఇంట్లో నిద్రిస్తుండగా అక్కాచెలెళ్లు ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఒంటికి శానిటైజర్ రాసుకున్న ప్రీతి ఆడుకునే క్రమంలో దేవుడి వద్ద వెలుగుతున్న దీపం దగ్గరికి వెళ్లడంతో మంటలంటుకున్నాయి. దీనిని గుర్తించిన ఆమె అక్క అక్షర కేకలు వేయడంతో నిద్ర మేల్కొన్న తల్లి రాజేశ్వరీ నీళ్లు చల్లి మంటలు ఆర్పివేసింది. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వీధి కుక్కల సమాచారం ఇవ్వండి

● కుక్కలపై ప్రజలకు అవగాహన కల్పించండి ● మహిళా గ్రూపులకు అధికారుల సూచన

బంజారాహిల్స్: వీధి కుక్కల దాడిలో ఇటీవల నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటనలో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ముఖ్యంగా మహిళా సమాఖ్యలకు, మహిళా గ్రూపులకు వీధి కుక్కల నియంత్రణపై తగిన అవగాహన కలిగించే నిమిత్తం జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

◆ జీహెచ్ఎంసీ సర్కిల్–18 పరిధిలోని టౌన్‌లెవల్ ఫెడరేషన్, స్లమ్ లెవల్ ఫెడరేషన్, సభ్యురాళ్లతో శనివారం బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని జీహెచ్ఎంసీ సిటీ మేనేజర్స్ శిక్షణ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

◆ జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం పీఓ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ వెటర్నరీ డాక్టర్ మోహన్‌రెడ్డి, డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి, యూసీడీ డీపీఓ బాలచంద్ర సుజన్ తదితరులతో జరిగిన ఈ సమావేశంలో సర్కిల్ పరిధిలోని 25 ఎస్ఎల్ఎఫ్‌లు పాల్గొన్నాయి.

◆ వీధి కుక్కల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలు త్వరలో సరఫరా చేస్తామని, వాటిని అన్ని పాఠశాలల్లో అందించాలని సూచించారు.

◆ వీధి కుక్కలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నెల రోజుల పాటు నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు.

◆ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఎస్ఎల్ఎఫ్‌లు, టీఎల్ఎఫ్‌ల ద్వారా అవసరమైన చోట్ల వీధి కుక్కలకు ఆహారాన్ని అందించడం, వీధి కుక్కల సమాచారం అందించేందుకు ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 040-21111111 ను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

◆ మహిళా గ్రూపులు, శానిటేషన్ వర్కర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. త్వరలోనే శానిటేషన్ వర్కర్లకు వీధి కుక్కల బెడద నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇస్తామని, వారు స్థానికులకు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు అవగాహన కలిగిస్తారన్నారు.

◆ వీధి కుక్కల దత్తత ద్వారా పెట్ ఓనర్‌షిప్‌ను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

◆ కుక్క కాటుకు గురైన వెంటనే క్షతగాత్రుల వివరాలను ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌కు అందిస్తామని, ఆ సమాచారం ద్వారా ఆయా ప్రదేశాల్లోని కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తారన్నారు.

◆ వీధి కుక్కల పట్ల ఎలా ప్రవర్తించాలి అనే అంశాలపై అవగాహన కలిగించారు. ప్రధాన కూడళ్లలో బిల్‌బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

◆ పిల్లలు బయటికి వెళ్లేటప్పుడు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా మహిళా గ్రూపులు పని చేయాలన్నారు. గుంపుగా ఉన్న కుక్కల వద్దకు వెళ్లరాదన్నారు.

◆ కుక్కలను వెంట పడి తరమడం మంచిది కాదన్నారు. కుక్కల వైపు తీక్షణంగా చూస్తే అవి రెచ్చిపోయే ప్రమాదం కూడా ఉందన్నారు.



వీధి కుక్కల నియంత్రణపై మహిళా సమాఖ్యలకు అవగాహన కలిగిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

బాలాపుర బస్తీలో వీధి కుక్కల స్వైరవిహారం

పంజగుట్ట: ఎర్రమంజిల్ బాలాపుర బస్తీలో వీధికుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు తెలిపారు. కుక్కలు బస్తీల్లో తిరుగుతూ దారిన వచ్చిపోయే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ ఎంతో మందిని కరిచాయని, కుక్కలు ద్విచక్ర వాహనాల వెంట పడటంతో పలువురు వాహనదారులు అదుపు తప్పి కిందపడిపోయారని తెలిపారు. ఎర్రమంజిల్ స్కూల్ పరిసరాల్లో కుక్కలు తిష్టవేయడంతో పాఠశాలకు వచ్చిపోయే సమయాల్లో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. గతంలో ఎర్రమంజిల్ క్వార్టర్స్‌లో నివాసముండే వారు వీటికి ఆహారం పెట్టేవారని, ఇప్పుడు క్వార్టర్స్‌ను కూల్చివేయడంతో వాటికి ఆహారం దొరక్క రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లేవారిపై దాడికి యత్నిస్తున్నాయన్నారు. జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని బాలాపుర బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్త గ్రూపులు తయారు చేయాలి

జీహెచ్ఎంసీ సర్కిల్–18 టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్‌ల సమావేశంలో యూసీడీ విభాగం అధికారులు మహిళా గ్రూపులను మరింత చైతన్యపరిచే రీతిలో పలు ప్రణాళికలు రూపొందించారు. తీసుకుంటున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తే మరొకరికి రుణాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. కొత్త మహిళా గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించారు.

కుక్కల బెడదపై చర్యలు తీసుకుంటున్నాం

ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: అంబర్‌పేటలో కుక్కల దాడిలో బాలుడు చనిపోయిన ఘటన తమను తీవ్రంగా కలిచి వేసిందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం ప్రతాప్‌నగర్‌లో కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వెల్దండ వెంకటేష్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుక్కల బెడదను నివారించేందుకు ప్రభుత్వ పరంగా జీహెచ్ఎంసీ నుంచి ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. చికెన్ సెంటర్లు, మటన్ షాపులు, చెత్తకుప్పల వద్ద, కూరగాయలు, నాన్‌వెజ్ మార్కెట్ల వద్ద బహిరంగ ప్రదేశాల్లో మాంసం ముక్కలు వేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే అధికారులను ఆదేశించామన్నారు. జరిగిన ఘటనను రాజకీయం చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఇది తగదన్నారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు అండగా ఉంటామని ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, నేతలు నల్ల శివ, యాకరి గణేష్, సురేష్, అశోక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భవిష్యత్ బీఆర్ఎస్‌దే: దానం

వెంకటేశ్వరకాలనీ: అభివృద్ధి పథకాలతో ప్రజా సంక్షేమంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ పార్టీదే భవిష్యత్ అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని ప్రతాప్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆయన స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కార్యకర్తలు అనవసరంగా ఇతర పార్టీల వైపు వెళ్లి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. బస్తీలు, కాలనీలు బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే ఎంతో అభివృద్ధి చెందాయని, ప్రతాప్‌నగర్ బస్తీలో 90 శాతానికి పైగా అభివృద్ధి పనులు పూర్తి చేసిన ఘనత తమదేనని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాములు చౌహాన్, నల్ల శివ, తదితరులు పాల్గొన్నారు.

'బాధితులకు కోర్టు తప్పక న్యాయం చేస్తుంది'



విజయారెడ్డిని కలిసిన బాధితులు

పంజగుట్ట: ఎర్రమంజిల్‌లో ఇళ్లు కూల్చివేసిన ఘటనలో న్యాయస్థానం తప్పక న్యాయం చేస్తుందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. బాధితులు హైకోర్టును ఆశ్రయించడంతో మార్చి 16వ తేదీ వరకు అక్కడ ఎలాంటి పనులు చేయరాదని ఆదేశిస్తూ స్టేటస్కో జారీ చేసింది. దీంతో బాధితులు శనివారం విజయారెడ్డిని కలిశారు. న్యాయస్థానం తప్పక మరోచోట ఆశ్రయం చూపిస్తుందన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీలో ఉన్న చిపోట్లే హైస్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. స్కూల్ చిన్నారులు తాము తయారు చేసిన వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లను ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఈ ప్రదర్శన ఎంతో దోహదం చేస్తుందని స్కూల్ ప్రిన్సిపాల్ శైలా స్వరాజ్ తెలిపారు.

'రెయిన్ బో'లో కాక్లియర్ ఇంప్లాంట్ దినోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ దినేష్‌కుమార్ చిర్ల

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.2లోని రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో శనివారం కాక్లియర్ ఇంప్లాంట్ దినోత్సవాన్ని నిర్వహించారు. రెయిన్ బో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ దినేష్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల్లో వినికిడి లోపాలను గుర్తించడంతో పాటు వాటి చికిత్సకు గల అవకాశాలపై సదస్సు నిర్వహించారు. పిల్లల్లో ప్రారంభ దశలోనే వినికిడి సమస్యను గుర్తిస్తే కాక్లియర్ ఇంప్లాంట్ చికిత్స ద్వారా పరిష్కరించవచ్చని డాక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. సదస్సులో వైద్యులు మౌనికారెడ్డి, మూర్తి, సత్యకిరణ్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వెంకటేశుడు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీవారిని హనుమంత వాహనంపై, రాత్రి గజ వాహనంపై ఊరేగించారు. వాహన సేవలో నగర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పాల్గొన్నారు. తిరువీధుల్లో స్వామివారు ఊరేగుతున్న అపురూప దృశ్యాలను తిలకించి పులకించిపోయారు. వేడుకల్లో భాగంగా ఉదయం సుప్రభాతం, తోమాల, అర్చన జరిగాయి.

'ప్రజాస్వామ్య పరిరక్షణ పట్టని ప్రభుత్వాలు'

లక్డీకాపూల్ : ప్రభుత్వాలు తమ ఉనికిని కాపాడుకొనేందుకు వెంపర్లాడుతున్నాయి తప్ప ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని రక్షించే పనిలో లేవని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం విమర్శించారు. ఫలితంగా సమాజంలో హింస అనేక రూపాల్లో జరుగుతుందని ఆందోళన చెందారు. శనివారం స్థానిక అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో జరిగినరాష్ట్ర మహాసభలో భాగంగా 'దళిత స్త్రీల సాధికారత– సామాజిక ప్రగతి ' అన్న అంశంపై జరిగిన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించారు.

యూకేలో పెరుగుతున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

బంజారాహిల్స్: కరోనా తర్వాత ఏడాది విదేశాల్లో చదువుకునే వారి సంఖ్య కాస్త తగ్గినప్పటికీ గత సంవత్సరం నుంచి ఆ సంఖ్య రెట్టింపు అయిందని గ్లోబల్ ట్రీ ఫౌండర్ శ్రీకర్ ఆలపాటి అన్నారు. శనివారం గ్లోబల్ ట్రీ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో బిగ్‌బిని-2023 పేరుతో యూకే ఎడ్యుకేషన్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. ఈ ఫెయిర్‌లో పెద్ద సంఖ్యలో నగరంలోని వివిధ కాలేజీలకు చెందిన యువత పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

వైద్య విద్యార్థినిని వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

లిబర్టీ: కాకతీయ మెడికల్ కాలేజీలో పీజీ చదువుతున్న ప్రీతి అనే విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన సీనియర్ విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రీతిని సీనియర్ విద్యార్థి వేధించడం వల్లే ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. వేధింపులకు పాల్పడిన విద్యార్థిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో విఫలమైన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు.

నగరానికి దూరంగా డాగ్స్ పార్క్ ఏర్పాటు చేయాలి

వెంగళరావునగర్: నగరానికి దూరంగా డాగ్స్ పార్క్ ఏర్పాటు చేసి అక్కడకు శునకాలను తరలించాలని పలుకాలనీలకు చెందిన ప్రతినిధులు డిమాండ్ చేశారు. యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్–19 కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ, ప్రతిరోజు కుక్కలు దాడులు చేస్తున్నా జీహెచ్ఎంసీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఆయా కాలనీల ప్రతినిధుల సమస్యలను విన్న డీఎంసీ రమేష్ మాట్లాడుతూ, కుక్కల దాడుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ ఏఎంఓహెచ్ బిందు భార్గవి, ఏఎంసీ ప్రేమ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్క కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వెంగళరావునగర్: చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపే సమయంలో కుక్క కాటుకు గురవకుండా తగిన రక్షణ కల్పించాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం వీధి కుక్కలపై నిర్వహించి అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏఎంఓహెచ్ బిందుభార్గవి, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, పవన్ ముదిరాజ్, సత్యనారాయణ, పూజారి బాల్‌రాజు, జహంగీర్, ఆదిత్యా చౌదరి పాల్గొన్నారు.

ఘనంగా వాల్యుయర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

ఖైరతాబాద్: తెలంగాణ వాల్యుయర్స్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని శనివారం ఖైరతాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్యుయేషన్, నిర్మాణ రంగంలో నూతన మెళకువలు, వాల్యుయేషన్‌లోని సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలపై సదస్సు నిర్వహించారు.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రియల్ ఎస్టేట్ అండ్ హౌసింగ్ యూనిట్) డీజీఎం డి.రవీంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి రోజూ 600 లోన్లు మంజూరు చేస్తుందని, ఇందులో వాల్యుయర్స్ పాత్ర ఎంతో కీలకమన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి, తెలంగాణ వాల్యుయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భీంరావు జాలిగామ, తెలంగాణ వాల్యుయర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎంవీఎల్ ప్రసాద్, కనకారావు, సెక్రటరీ శ్రీధర్, జాయింట్ సెక్రటరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ విరాళంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం



బంజారాహిల్స్: బంజారాహిల్స్ సయ్యద్‌నగర్‌లో ఓ ప్రవాస భారతీయుడు (ఎన్ఆర్ఐ) ఇచ్చిన విరాళంతో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి శనివారం మున్సిపల్ పరిపాలనా విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్ కుమార్,దాత గుజ్జుల రవీంద్రతో కలిసి భూమి పూజ చేశారు. జర్మనీలోని అట్లాస్ బర్గ్ నగర మేయర్‌గా పని చేసిన భద్రాచలానికి చెందిన రవీంద్ర గుజ్జుల ఇక్కడ అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి నిధులు అందించారు. ఆయన తన భార్య గ్యాబి తో కలిసి భూమి పూజలో పాల్గొన్నారు. కాగా, రూ. 12 లక్షలతో 180 గజాల విస్తీర్ణంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించనున్నారు. జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వర్‌రావు, జెడ్పీ రవికిరణ్ పాల్గొన్నారు.

టీవీ ప్రొడక్షన్ అసిస్టెంట్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

వెంగళరావునగర్: టీవీ ప్రొడక్షన్ అసిస్టెంట్స్ సేవలు వెలకట్టలేనివని ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కూర్మాచలం అన్నారు. టెలివిజన్ ప్రొడక్షన్ అసిస్టెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు శనివారం వెంకటగిరి కార్యాలయంలో జరిగాయి. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ, తన హయాంలోనే టీవీ నగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. తొలుత నూతన అధ్యక్షుడు పుట్టా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి శ్రీనాధు శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీవీ ఫెడరేషన్ అధ్యక్షుడు రాకేష్ (నాని), కార్యదర్శి పుట్టా విజయ్‌కుమార్, కోశాధికారి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభించాలని వినతి

బంజారాహిల్స్: వినియోగదారుల కౌన్సెలింగ్ సెంటర్‌ను తిరిగి ప్రారంభించాలని వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు శనివారం సివిల్ సప్లయ్ కమిషనర్ వి.అనిల్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామగిరి హరిబాబు మాట్లాడుతూ, కౌన్సెలింగ్ సెంటర్ అందుబాటులో ఉన్న సమయంలో పదుల సంఖ్యలో కేసులను విచారించి వినియోగదారులకు న్యాయం జరిగేలా చూసేవారని, ఇప్పుడు కౌన్సెలింగ్ సెంటర్‌ను మూసివేయడంతో బాధితులు కన్స్యూమర్ ఫోరం, వినియోగదారుల కోర్టుకు వెళ్లలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఎం. శ్రీకాంత్‌రెడ్డిని కలిసి జిల్లాల్లో తమ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. హక్కుల సంస్థ ప్రతినిధులు శివకుమార్, వల్లాల రవి, సెక్రటరీ బొడ్డుల నగేష్ కుమార్, మాతంగి సుగుణ రాజు తదితరులు పాల్గొన్నారు.

వియత్నాంలో పెట్టుబడులకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: వియత్నాంలో వాణిజ్యం, పెట్టుబడి అవకాశాలపై శనివారం రెడ్‌హిల్స్‌లోని తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఎఫ్‌టీసీసీఐ)లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి 11 మంది సభ్యుల వియత్నాం ప్రతినిధి బృందం హాజరైంది. ఐటీ, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, హెల్త్‌కేర్, తదితర రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లు కోరింది. వియాత్నంలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు, టియన్ గియాంగ్, బిన్ దిన్, బారియా వుంగ్ టౌ ప్రావిన్సులు, హోచిమిన్ ప్రావిన్స్, నగరాలకు చెందిన అధికారులు ఈ బృందంలో ఉన్నారు. వియత్నంలోని భారత రాయబార కార్యాలయంలో వాణిజ్య విభాగం, కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియాలో విధులు నిర్వహిస్తున్న బుయి అన్హ్ తువాన్ ఈ బృందానికి ప్రాతినిధ్యం వహించారు.ఎఫ్‌టీసీసీఐ సీఈఓ ఖ్యాతి నరవాణే, అధ్యక్షుడు అనిల్ అగర్వాల్, హైదరాబాద్ రీజనల్ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య, ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడు సురేష్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

100 కేజీల బంగారం చోరీకి గురైందని ఫిర్యాదు

బంజారాహిల్స్: తమ కార్యాలయంలోని వంద కేజీల బంగారం చోరీకి గురైందని హీరా గ్రూప్ కంపెనీస్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ రాజశేఖర్ రెడ్డి హీరా గ్రూప్ కంపెనీస్ సీఈవో నవ్‌హీరా షేక్ తరఫున శనివారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 86 లోని భవనంలో హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కొనసాగుతున్నాయని 2016లో నవ్‌హీరా షేక్ వంద కేజీల బంగారం, రూ.10 లక్షల నగదు లాకర్‌లో భద్రపరిచారని, 2021 మార్చిలో నవ్‌హీరా షేక్ ఆఫీసుకు వెళ్లి చూడగా లాకర్‌లో ఉండాల్సిన బంగారం కనిపించలేదన్నారు. ఈ ఘటనపై కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేయాల్సిందిగా బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదానీపై ఈడీ, సీబీఐతో విచారణ చేయించండి: గజ్జెల

పంజగుట్ట: ప్రధాని నరేంద్ర మోదీ ముందుగా అదానీపై ఈడీ, సీబీఐ, ఐటీతో విచారణ చేయించి తర్వాత వేరే వారిపై చేయించాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం డిమాండ్ చేశారు. శనివారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి వెంకటేశం గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2013లో అదానీ ఆస్తులు 900 కోట్లు ఉంటే, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ధనికుల జాబితాలో 3వ స్థానానికి వెళ్లాడని, అలాంటి వారిపై దాడులు చేయకుండా..వందల కోట్లు ఉన్న ఎలాంటి తప్పులు చేయనివారిపై దాడులు చేయించడం సరికాదన్నారు. మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యా యత్నం బాధాకరమని, ఈ ఘటనను కూడా రాజకీయం చేయాలని బీజేపీ నాయకులు చూడటం నీచమైన చర్యల అని అన్నారు. సమావేశంలో డాక్టర్ సంజీవ్ నాయక్, రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా లెవెల్ బాడీ బిల్డింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: తెలంగాణ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడలోని జయా గార్డెన్స్‌లో స్టీల్‌మెన్ క్లాసిక్ సౌత్ ఇండియా లెవెల్ బాడీ బిల్డింగ్ పోటీలు జరిగాయి. ఐదు రాష్ట్రాల నుంచి 300లకు పైగా బాడీబిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొని మ్యూజిక్‌కు అనుగుణంగా విన్యాసాలు చేస్తూ తమ బాడీని ప్రదర్శించారు. సోమాజిగూడ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎ.మహేష్ యాదవ్ సహకారంతో మిస్టర్ ఇండియా శివ, ఆర్.ఎస్.రాహుల్‌లు ఈ కార్యక్రమం నిర్వహించారు. బాడీబిల్డింగ్, క్లాసిక్ ఫిజిక్, మెన్స్ ఫిజిక్, జూనియర్ మెన్స్ ఫిజిక్, క్లాసిక్ ఫిజిక్ ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించి మొదటి, రెండవ, మూడవ బహుమతులు, నగదు పురస్కారం అందించారు. ఈ పోటీలు చూసేందుకు పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యారు.

న్యాయవాది ఇంటి కబ్జాకు యత్నం

● అర్ధరాత్రి 70 మంది రౌడీలు ఇంట్లోకి చొరబడి బీభత్సం

● నిందితుల్లో కొందరి అరెస్టు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నం. 5లోని ఉమెన్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో నివసిస్తున్న సుప్రీం కోర్టు న్యాయవాది విశ్వనాథరెడ్డి ఇంట్లోకి శుక్రవారం అర్ధరాత్రి 70 మంది భూకబ్జాదారులు, రౌడీలు చొరబడి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసి ఇంటిని కబ్జా చేసేందుకు యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉమెన్ కో–ఆపరేటివ్ సొసైటీ ప్లాట్ నం.85, 86లో వెయ్యి గజాల స్థలం 1990 నుంచి సుప్రీం కోర్టు న్యాయవాది విశ్వనాథరెడ్డి, అయన భార్య సురేఖా రెడ్డి ముదిగంటి ఆధీనంలో ఉంది. ఇందులో ఇల్లు కట్టుకొని కొడుకు భరత సింహారెడ్డితో కలిసి ఉంటున్నారు. ప్రభుత్వానికి క్రమబద్ధీకరణ కోసం కూడా దరఖాస్తు చేసుకొని ఫీజు చెల్లించారు. అయితే పరమేశ్వర్‌రామ్ అనే విశ్రాంత గ్రూప్–1 అధికారి ఈ స్థలం తనదేనంటూ వాదిస్తూ అదే ప్రాంతంలో ఉండే ప్లాట్ నంబర్ 91కి చెందిన పత్రాలతో విశ్వనాథ్‌రెడ్డి ప్లాట్‌ను మరొకరికి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్‌కు రూ.15 లక్షలు తీసుకొని ఇచ్చాడు. దీంతో సదరు వ్యక్తి అర్ధరాత్రి 70 మంది గూండాలను తీసుకొని కర్రలు, రాడ్లతో బీభత్సం సృష్టించి కారంపొడి పొట్లాలు చల్లుతూ వీరంగం సృష్టించాడు. దీంతో తీవ్ర భయభ్రాంతులకు గురైన వాచ్‌మెన్‌తో పాటు విశ్వనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో డయల్ 100కు కాల్ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులను చూసి రౌడీల్లో కొందరు పారిపోగా, మరికొందరిని అదుపులోకి తీసుకొని విచారించారు. శనివారం బంజారాహిల్స్ ఏసీపీ శ్రీధర్, సీఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేత

బంజారాహిల్స్: అంబర్‌పేటలో కుక్కల దాడిలో మరణించిన నాలుగేళ్ల బాలుడు ప్రమోద్ కుటుంబానికి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. బాలుడి తండ్రి గంగాధర్ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తుండగా, తల్లి జనప్రియ ఇళ్లలో పని చేస్తున్నది. కొడుకు మృతిని తట్టుకోలేక అపస్మారక స్థితిలోకి వెళ్లిన తల్లి కమలాపురి కాలనీలోని తన్వీర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నదని, ఈ పేద కుటుంబానికి దాతలు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని దిడ్డి సుధాకర్ కోరారు. సాయం చేయదలచిన వారు బాలుడి తండ్రి గంగాధర్‌ను సంప్రదించాలన్నారు.

స్నేహితుడిని కత్తితో పొడిచి..
తల, గుండె వేరు చేసి..

- తాను ప్రేమించిన యువతికి దగ్గరవుతున్నాడన్న కక్షతో యువకుడి దుర్మార్గం
- పథకం ప్రకారం పిలిపించి.. హత్యచేసిన ఇంజనీరింగ్ విద్యార్థి


నిందితుడు హరిహర కృష్ణతో జీవన్ (సర్కిల్‌లో)

